సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్‌కు చెందిన గోపని పుణ్యవతికి రూ.60 వేల ఆర్థికసాయం మంజూరుకావడంతో చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మాజీ వైస్‌ఎంపీపీ వెంకటేషం, బీఆర్‌ఎస్ నేతలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి సత్కారం



కీసర: నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పార్టీ విషయాలపై చర్చించారు. మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నక్క కిషోర్‌గౌడ్, అక్కల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో 'స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల ఆరోగ్యంపై దృష్టిసారించేందుకే 'స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం మల్లారెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

శరన్నవరాత్రి ఏర్పాట్ల పరిశీలన

పోచారం: అన్నోజిగూడలోని గాయత్రి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణ కోసం చేస్తున్న ఏర్పాట్లను మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. 22 నుంచి వచ్చే నెల 2 వరకు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

జాప్యమెందుకు ?

- అద్దె భవనంలోనే మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయం
- భవనం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం



మూడుచింతలపల్లి తహసీల్దార్ నూతన భవనం

శామీర్‌పేట్: గత ప్రభుత్వ హయాంలో మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలంలోని కొన్ని గ్రామాలను కలుపుతూ.. మూడుచింతలపల్లి మండలకేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేశారు. కాగా మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను తాత్కాలికంగా అద్దె భవనాల్లో ఏర్పాటు చేసి పాలనను కొనసాగిస్తున్నారు. దాతల సహకారంతో రూ.80 లక్షల వెచ్చించి తహసీల్దార్ కార్యాలయం కోసం భవనాన్ని నిర్మించారు. భవనం పూర్తై ఏడాది కావొస్తున్నా.. నేటికి ప్రారంభించకపోవడంతో స్థానికులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అరకొర వసతులతో అద్దె భవనంలోనే..

రెవెన్యూ పనులతో పాటు రిజిస్ట్రేషన్ బాధ్యతలు సైతం తహసీల్దార్‌లకే అప్పగించడంతో తహసీల్దార్ కార్యాలయాలకు ప్రజల తాకిడి పెరిగింది. ఇక మూడుచింతలపల్లి రెవెన్యూ కార్యాలయం అద్దె భవనం కావడంతో అరకొర వసతులు, ఇరుకు గదుల్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు సైతం పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వివిధ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది. కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో ఎండలోనే నిలబడుతూ.. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

ఆసక్తి చూపని ప్రజా ప్రతినిధులు

తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడానికి అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు సుముఖత చూపడం లేదని ఓ అధికారి ప్రతిపక్ష పార్టీల నేతలతో చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందనే భావన కొందరిలో ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

◆ శామీర్‌పేట మండలంలోని 13 గ్రామాలను కలుపుతూ మూడుచింతలపల్లిని మండలకేంద్రంగా ఏర్పాటు చేశారు. ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) రూ. 66 కోట్లను కేటాయించారు. దీంతో పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలపై మాజీ సీఎం కేసీఆర్ పేరు ఉందని, ఇందుకు కొందరు అధికార పార్టీకి చెందిన వారికి ఇది నచ్చకనే మండల అభివృద్ధి నిలిచిపోయిందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి నిలిచిపోయింది



మూడుచింతలపల్లి మండలంలో గత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మా మండలానికి ఎలాంటి నిధులు మంజూరు కావడం లేదు. అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివక్షను వీడి నూతన భవనాన్ని ప్రారంభించేందుకు అధికార పార్టీ నాయకులు, అధికారులు చొరవ తీసుకోవాలి

– మురళీగౌడ్, మూడుచింతలపల్లి

త్వరలోనే మంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తాం..



ఎలాంటి వసతులు లేకున్నా.. ఆగమేఘాలపై మాజీ సీఎం మూడుచింతలపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచే మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటిని ప్రారంభోత్సవానికి ఆహ్వానించాం. త్వరలోనే కొత్త భవనం అందుబాటులోకి వస్తుంది.

– నర్సింహులుయాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్

నిర్మాణంలోని భవనాలను త్వరగా పూర్తి చేయాలి



సోమారంలో భవననిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన పథకాల్లో భాగంగా నిర్మిస్తున్న భవనాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో సోమారం గ్రామంలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజీ గర్ల్స్ భవన నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవనమంతా పరిశీలించి పనులపై ఆరా తీశారు. ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన పనులు ముందుగా పూర్తి చేయాలని ఆదేశించారు. బోడుప్పల్‌లో అద్దె భవనంలో ఉన్న స్కూల్‌ను దసరా సెలవుల లోగా తరలించాలని ఆర్‌సీఓను ఆదేశించారు. ఆర్‌సీఓ నాగార్జున, తహసీల్దార్ భూపాల్, ప్రిన్సిపాల్ మమత తదితరులున్నారు.

స్థానిక సమస్యలపై అధికారుల పర్యటన



స్థానిక సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటగోపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన మునీరాబాద్ గ్రామంలో గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, అధికారులు పర్యటించారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా గ్రామ నాయకులతో కలిసి పలు కాలనీల్లో తిరిగి సమస్యలను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య, వైకుంఠదామం, క్రీడా ప్రాంగణం, పార్కు స్థలాలను సందర్శించి అవసరమయ్యే అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపును ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచులు, నాయకులతో సమావేశమై సమస్యలు, పరిష్కారాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, అధికారులు చంద్రమోహన్, భాస్కర్, అశ్వంత్, మాజీ సర్పంచులు చిట్టిమిల్ల గణేష్, శ్రీనాథ్‌రెడ్డి, గణేష్, మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

మేడ్చల్‌రూరల్: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా కార్యాలయం మొత్తం అగ్నికి ఆహుతైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలో పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో కుడి వైపున కార్యాలయం ఉంది. గురువారం తెల్లవారుజామున కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. ఎల్‌ఐసీ కార్యాలయంలో పైన ఉన్న మూడు అంతస్తుల్లో ఉన్న 24 ప్లాట్లలో రెండు కార్యాలయాలతో పాటు పలు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పూర్తిస్థాయిలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎల్‌ఐసీ కార్యాలయంలో పైన సీలింగ్, ఫర్నిచర్, కంప్యూటర్లు, పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి.

కోతుల వల్ల ప్రమాదం...

కోతులు వల్లే ప్రమాదం జరిగినట్లు భవనంలో అద్దెకు ఉంటున్న వారు చెబుతున్నారు. భవనానికి ముందు గేటు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కోతులు ఆడుతూ.. విద్యుత్ తీగలపై దూకడంతో ఒక్కసారి కాలిపోయిన శబ్దం వచ్చినప్పుడే ఎల్‌ఐసీ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని, చెబుతున్నారు. విద్యుత్ తీగల మీద దూకిన కోతి కూడా గాయపడి, కొద్దిసేపు అక్కడే ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. కాగా జరిగిన నష్టం అంచనాకు సంబంధించి ఆ సంస్థ అధికారులు మేడ్చల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

కీసర: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కీసర పోలీసులు సకాలంలో స్పందించి అతడిని కాపాడారు. చీర్యాలకు చెందిన దశరథ (45) సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. కాగా అతడు మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండేవారు. గురువారం మద్యం మత్తులో భార్యతో గొడవపడి, ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఇంటి తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న అతడిని దించి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

ఆర్థికసాయం

కీసర: కీసర మండలంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చిరంజీవి తల్లి ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) కీసర మండల ఆధ్వర్యంలో చిరంజీవిని కలిసి పరామర్శించారు. అనంతరం టీయూటీఎఫ్ తరపున ఆయనకు రూ.10,116 ఆర్థికసాయం అందజేశారు. రామినేని వెంకటేశ్వర్లు, నూకల నర్సింగ్‌రావు, మోహన్‌బాబు, శివకృష్ణ, పెద్దోళ్ల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు దేశభక్తిని నేర్పించాలి

ఎంపీ ఈటల రాజేందర్



నేతాజీ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: మనం మన పిల్లలకు వారసత్వంగా ఇవ్వాల్సింది.. ఆస్తులే కాదు.. విలువలతో పాటు దేశభక్తిని నేర్పాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. గురువారం కాప్రా సర్కిల్‌లో పర్యటించిన ఎంపీ ఈటల నేతాజీనగర్ పార్క్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని ఘటనలు చూస్తుంటే మనల్ని కలిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'కన్నతల్లిదండ్రులు, కడుపున పుట్టిన పిల్లలు, భర్తభార్యను, భార్యభర్తను చంపుతున్నారన్నారు. అవి ఎక్కడో..? జరుగుతున్నాయనుకుంటే పొరపాటే.. మనచుట్టూ ప్రమాదం పొంచి ఉందని, అందుకే మనపిల్లలను జాగ్రత్తగా పెంచాలని' సూచించారు.

◆ నేతాజీనగర్‌లో పార్క్ చిన్నదే.. అయినా గొప్ప మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్‌తరాలకు ఓ మంచి సందేశం ఇచ్చారని తెలిపారు. మహనీయుల విగ్రహాలు పెట్టి, జయంతి వేడుకలు, వర్ధంతులు నిర్వహించి ఓ పూలదండ వేయడం కోసం కాదని, వారి చరిత్ర భావితరాలకు అందించడం కోసమన్నారు. సెప్టెంబర్ 17న మనం ఎగురవేసుకున్న జాతీయజెండా తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తు చేసిందని చెప్పారు. దేశంతో పాటు మనకు స్వాతంత్య్రం రాలేదని, అందుకోసం మన పూర్వీకులు పడ్డకష్టం, ప్రాణత్యాగం భావితరాలకు అందించడమే తెలంగాణ విమోచన దినోత్సవ లక్ష్యమన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం లక్షలమంది పోరాటం, త్యాగాలు గుర్తుచేసుకుంటే రోమాలు నిక్కపొడుస్తాయన్నారు.

నేతాజీ గొప్ప మేధావి..

నేతాజీ సుభాష్ చంద్రబోస్ గొప్ప మేధావి అని, ఆనాడే ఇప్పటి ఐఏఎస్ లాంటి(ఐసీఎస్)ను పూర్తి చేశారన్నారు. ఆయన ప్రాణం తన కోసం కాదని భరతజాతి విముక్తి కోసమని, భారతమాత సంకెళ్లు తెంచడం కోసమేనని పోరాడారని గుర్తు చేశారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు మనందరం కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర భారతావని సాధన దిశగా నేతాజీ సాహసోపేత అడుగులు వేశారని గుర్తు చేశారు. గొప్ప జాతీయవాది, దూరదృష్టి కలిగిన నేతాజీ ఆశయాలు, త్యాగాలు దేశవాసులకు ఎప్పటికీ స్ఫూర్తిని ఇస్తాయన్నారు. ప్రతిరోజూ ఎంపీ ఈటల రాజేందర్ ప్రజల మధ్యే ఉంటున్నారని, దేశంలో అతి ఎక్కువ పర్యటనలు చేస్తున్న ఎంపీగా ఆయన మొదటిస్థానంలో నిలుస్తారని కొనియాడారు. ఉప్పల్ నియోజకవర్గానికి నిధులు కూడా తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, స్థానిక నేతలు భైరి నవీన్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మధుకర్‌రెడ్డి, నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



నాగారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేదరి మహేంద్ర సంఘం సభ్యులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మేదరి సంఘం కమ్యూనిటీహాల్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. మహేంద్రుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. వెదురు పెంపకం వల్ల ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందని, వెదురును పెంచేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు ముకుందం, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి ఉమా, సంజయ్‌కుమార్, గంగాధర్, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారు మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నేతలు సాయినాథ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, అంజన్న, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు 'ఫుడ్ సేఫ్టీ'పై అవగాహన



మేడ్చల్: మున్సిపల్ పరిధిలో వీధుల్లో వ్యాపారం చేసే వారికి మున్సిపల్ అధికారులు ఫుడ్ సెఫ్టీపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వీధి వ్యాపారులకు ఆహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాల గురించి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ట్రేనీ శివాణి వ్యాపారులకు సూచించారు. స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ తప్పనిసరిగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మెప్మా జిల్లా పీడీ విజయలక్ష్మి, కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, డీఎంసీ అనిల్‌కుమార్, టీఎంసీ నరేష్ వీధి వ్యాపారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్

- 300 ఇళ్లల్లో తనిఖీలు.. వాహనాలు, మద్యం సీజ్
- డీసీపీ నంద్యాల కోటిరెడ్డి



మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి.. చిత్రంలో సీజ్ చేసిన మద్యం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఏసీపీలు శంకర్‌రెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలు 176 మంది పోలీస్ సిబ్బందితో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో గల 300 ఇళ్లలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి బిహార్, అస్సాం, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాలతో పాటు స్థానికులు మొత్తం వేయిమంది వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 18 ద్విచక్రవాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని 3 లిక్కర్ కేసులు, మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. సెర్చ్‌లో భాగంగా ఇద్దరు వ్యక్తులు గంజాయి తీసుకున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ పోలీసులు సైతం తనిఖీలు నిర్వహించి 188 వాహనాలపై పెండింగ్‌లో ఉన్న రూ.91 వేల ట్రాఫిక్ చలాన్లను వసూలు చేయగా.. డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కిష్టాపూర్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అధికంగా నివసిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు వచ్చినట్లు చెప్పారు. భవన యజమానులు ఇతర రాష్ట్రాల వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఇక్కడ తలదాచుకుంటున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు స్వచ్ఛందంగా కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ, 10 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఆర్ పోలీస్, ఎస్వోటీ, టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, మహిళాపోలీసులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయానికి..

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు
- ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్‌శాఖ

శామీర్‌పేట్: మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలోకి తరలించాలని పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేశారని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. గురువారం శామీర్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌కు ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మండల పరిషత్ కార్యాలయం భవనం ఖాళీ కావడంతో ఆ భవనాన్ని, హాల్, గెస్ట్ రూమ్ సబ్ రిజిస్ట్రార్ కార్యకలాపాలకు వాడుకోవడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని వివరించారు. మండల పరిషత్ కార్యాలయం భవనాలను సబ్ రిజిస్టార్ కార్యాలయానికి కేటాయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. డైరక్టర్ బిక్షపతి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తుంకి రమేష్, కాంగ్రెస్ నేతలు వెంకటేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న హన్స్‌రాజ్ గంగారాం అహిర్, వేదికపై ప్రజాప్రతినిధులు

మల్కాజిగిరి: సమాజంలో గుర్తింపు రావాలంటే బీసీలు చైతన్యవంతులు కావాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్ అన్నారు. గురువారం ప్రశాంత్‌నగర్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బీపీ మండల్ 107వ జయంతోత్సవాలు దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు చట్టబద్ధత ఉండేదని మోదీ ప్రధాని అయిన తర్వాత బీసీ కార్పొరేషన్‌కు చట్టబద్ధత వచ్చిందన్నారు. రిజర్వేషన్ల ఫలాలు దక్కాలంటే ఐకమత్యంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీ వాత్సవలు మాట్లాడారు. కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, యూనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీనాక్షి, చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి బీవీఎస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కోశాధికారి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ సేవలపై అవగాహన



కుషాయిగూడ: పోలీసుశాఖ సేవలు, చట్టాలపై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కంపెనీ ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస, షీ టీమ్స్, సైబర్ నేరాలు వంటి పలు అంశాలను మహిళలకు వివరించారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. నల్గొండకు చెందిన జాగృతి పోలీస్ కల్చరల్ టీం సభ్యులు పాటలతో మహిళల్లో ఉత్తేజం నింపి చట్టాలపై అవగాహన పెంచారు. చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ బృందం ప్రతినిధులు షారన్, సవిత తదితరులున్నారు.